క్లుప్తంగా

'అభివృద్ధికి పెద్దపీట'



శంకుస్థాపన చేసిన చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: అన్ని వార్డుల అభివృద్ధి లక్ష్యంగా సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం పనిచేస్తుందని చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని 18వ వార్డులో శ్రీసీతారామాంజనేయ దేవస్థానం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు ఆమె శ్రీకారం చుట్టి మాట్లాడారు. వార్డులో మహిళా సమాఖ్యల అవసరాల నిమిత్తం భవనం రూపుదిద్దుకుంటుందన్నారు. రూ.43 లక్షలతో భవనం నిర్మాణం చేపడుతున్న ఆలయం పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాబార్డ్ అధికారి

ఎల్లారెడ్డిపేట: మహిళలు కుట్టు మిషన్ శిక్షణ పొంది ఆర్థిక పురోగతిని సాధించాలని నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజన్నపేట గ్రామంలో కరీంనగర్ జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ, నాబార్డ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ ముక్క శంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ అందే సుభాష్, ఎంపీటీసీలు రజిత, అనసూయ, ఏపీఎం మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులను సన్మానిస్తున్న నాగి శేఖర్

బోయినపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తూ ఉత్తమ మార్కులు సాధించిన ఇంటర్ విద్యార్థులను ప్రోత్సహించడానికి రాజీవ్ గాంధీ విద్యార్థి పురస్కార్ అవార్డులు ఇచ్చి సత్కరిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ తెలిపారు. బుధవారం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన మండల విద్యార్థులు ఎం.భవాని, డి.మనోహర్, నిఖిత, ప్రవల్లిక, శ్యామల, స్వాతిలకు స్థానిక మోడల్ స్కూల్‌లో మెమెంటోలతో సత్కరించారు. ఎంసెట్‌కు కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్, తడగొండ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, నాయకులు గంగిపెల్లి లచ్చయ్య, దమ్ము మల్లికార్జున్, పిండి శ్రీనివాస్‌రెడ్డి, గుడ్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

'కర్ర'ంట్ స్తంభాలు..!

- వేలాడే వైర్లతో రైతుల ఇబ్బందులు
- చేతికి అందే ఎత్తులోనే వెళ్తున్న వైనం
- ప్రమాదకరంగా మారిన లూజ్ వైర్లు
- మిడిల్ పోల్స్ వేస్తేనే తీరనున్న తిప్పలు



రత్నంపేటలోని ఒక ఇంట్లో విద్యుత్ వైర్లు తగలకుండా పాతిన కర్ర



బోయినపల్లి ఏఎంసీ వద్ద వంగిన విద్యుత్ స్తంభం

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. పలు చోట్ల మిడిల్ పోల్స్ లేక పోవడంతో విద్యుత్ స్తంభాలపై లూజ్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. హైటెన్షన్ విద్యుత్ వైర్లు చేతికి అందే ఎత్తున ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. బోయినపల్లి సెస్ పరిధిలో 23 గ్రామాలున్నాయి. కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయిపల్లి గ్రామాలు సైతం మండల సెస్ పరిధిలోనే ఉన్నాయి. విలాసాగర్, మల్కాపూర్, వెంకట్రావుపల్లి, బోయినపల్లి, కోరెం, స్తంభంపల్లి గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

ప్రమాదకరంగా లూజ్ వైర్లు

మండలంలో అన్ని కేటగిరీలకు చెందిన 21,846 విద్యుత్ కనెక్షన్లున్నాయి. 429 త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు, 235 సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

➡ సెస్ పరిధిలోని రత్నంపేట, బోయినపల్లి, తడగొండ, దేశాయిపల్లి, మల్కాపూర్, అనంతపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి తదితర గ్రామాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉన్నాయి.

➡ రత్నంపేట గ్రామంలో ఓ ఇంట్లో వేలాడుతున్న లూజ్‌వైర్లకు సపోర్టుగా కర్రను ఏర్పాటు చేసుకున్నారు.

➡ బోయినపల్లిలోని మొదటి వార్డులో సుమారు పది ఇళ్లకు దూరంగా స్తంభాలు ఉండడంతో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఇక్కడ రెండు కొత్త స్తంభాలు వేసి సరిచేయాలని కోరుతున్నారు.

➡ నీలోజిపల్లి గ్రామ ఐదో వార్డులో లూజ్‌వైర్లు చాలా ఉన్నాయని వార్డు సభ్యుడు సింగిరెడ్డి బాలమల్లు తెలిపారు.

➡ తడగొండ గ్రామంలో పలువురి పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉన్నాయని రైతులు శీలం రామచంద్రం, లచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, గోగూరి దామోదర్‌రెడ్డి తెలిపారు.

➡ వ్యవసాయ క్షేత్రాల్లో పలుచోట్ల వైర్లు కిందకు వేలాడుతుండడంతో, అవి తగలకుండా ఉండేందుకు సపోర్టు కర్రలు ఏర్పాటు చేసినట్లు రైతులు తెలిపారు.

➡ స్తంభంపల్లి, రామన్నపేట రైతుల చేలలో పలు చోట్ల వైర్లు చాలా కిందికి ఉన్నాయని రైతులు తెలిపారు. మర్లపేట, అనంతపల్లి, దుండ్రపల్లి, గుండన్నపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో రైతుల చేలలో అనేక చోట్ల విద్యుత్ వైర్లు అందే ఎత్తులో వేలాడుతుండడంతో రైతులు భయపడుతున్నారు. మండలంలో లూజ్ లైన్ల కోసం 11 కేవీ లైన్‌లో 100 స్తంభాలు, ఎల్టీ లైన్‌లో 180 స్తంభాలు మంజూరయినట్లు ఇటీవల జరిగిన మండల సభకు సెస్ అధికారులు ఇచ్చిన నివేదికలో తెలిపారు.

హైటెన్షన్ తీగల మధ్య..



రత్నంపేట గ్రామంలో ఇళ్ల పరిసరాల్లో పలుచోట్ల విద్యుత్ వైర్లు వేలాడుతూ ఉన్నాయి. కొందరు ఇంటి ఆవరణలో వేలాడుతున్న తీగలకు సపోర్టు కర్రలు ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని ఇళ్ల ముందు హైటెన్షన్ విద్యుత్ తీగల వల్ల షాక్ రాకుండా ఉండేందుకు ప్లాస్టిక్ పైపులు తొడిగారు. సెస్ అధికారులు స్పందించి ఇబ్బంది లేకుండా చూడాలి.

– కౌడగాని వెంకటేశ్, రత్నంపేట

తరచూ విద్యుత్ అంతరాయం



బోయినపల్లి గ్రామంలోని హైస్కూల్ పరిసరాల్లో, ఫ్లైయాష్ సిమెంట్ బ్రిక్స్ ఏరియాలో ఉన్న ఓ చెట్టు కొమ్మలకు వైర్లు తగిలి తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయం సెస్ అధికారుల దృష్టికి పలుసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. ఎన్నోసార్లులో హైఓల్టేజీ విద్యుత్ సరఫరాతో ఇబ్బంది ఏర్పడింది.

– బోయిని మల్లేశం, బోయినపల్లి

మిడిల్ పోల్స్ వేయాలి



లూజ్‌వైర్లు ఉన్న ప్రాంతాల్లో మిడిల్ ఫోల్స్ వేసేందుకు అధికారులు చొరవ చూపాలి. లూజ్ వైర్లతో ఈదురు గాలులకు వైరు మీద వైరు పడి షార్ట్ సర్క్యూట్‌తో పలుసార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సెస్ నూతన పాలకవర్గం మండలంలో సెస్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

–అనుముల హరికృష్ణ, నీలోజిపల్లి, రైతు

సమస్య పరిష్కారానికి కృషి



కొన్ని ప్రాంతాల్లో లూజ్ వైర్ల సమస్యలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇటీవల రత్నంపేట గ్రామంలో లూజ్‌వైర్లు ఉన్న ఓ ఇంటిని సందర్శించడం జరిగింది. సెస్ చైర్మన్ సహకారంతో మొదట మండలంలో లూజ్ వైర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. అలాగే సెస్ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోంటాం.

–కొట్టెపెల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్, బోయినపల్లి

దాడిని ఖండిస్తూ ఏబీవీపీ నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: ఏబీవీపీ నాయకులపై బుధవారం కరీంనగర్‌లో ఇల్లంతకుంట జెడ్పీటీసీ సిద్దం వేణు దాడి చేయడం సరికాదని ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెం నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏబీవీపీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ కార్యకర్తలకు గుండాయిజం నేర్పుతున్నారా అని మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం చేతకాక ప్రశ్నించే గొంతులపై ఇలాంటి దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లకు పక్క భవనాలు, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌మ యశ్వంత్, విజయ్, రాంచరణ్, ప్రశాంత్, ప్రవీణ్, గణేశ్, రాము, భాను, ప్రవీణ్, సునీల్, రమేశ్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ గణన చేపట్టాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న అత్యధిక జనాభాగల బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై చిన్నచూపు చూస్తోందని, ఇప్పటి వరకు బీసీ గణన చేపట్టకపోవడం బాధకరమన్నారు. బీసీ కార్పొరేషన్, కమిషన్‌లను ఏర్పాటు చేయకుండా మోసం చేస్తుందన్నారు. 52 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నీరటి భాను, ప్రధాన కార్యదర్శి షేక్ హైదర్, మండల కోశాధికారి కొపెల్లి రాజు, మండల కార్యదర్శులు బొడ్డ కిషన్, అందె ఈశ్వర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

సిరిసిల్లటౌన్/సిరిసిల్ల ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు పెద్దగా ఒరిగేదేమీ లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉద్యోగులకు సైతం నిరాశ కల్గించిందని పలువురు మేధావులు విమర్శిస్తున్నారు.

ఉద్యోగులకు అనుకూలం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులకు అనుకూలంగా ఉంది. ఆదాయ పన్ను స్లాబులు మార్చడం సంతోషంగా ఉంది. మధ్యతరగతి ఉద్యోగులపై ఆదాయపన్ను భారం తగ్గించేలా ఉంది.

– లింకల జయకృష్ణారెడ్డి, టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

వేతన జీవులకు నిరాశ



పైకి ఊరట కల్పించేలా ఉన్నా పన్నుపోటు తప్పదు. ఆదాయ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచినప్పటికీ.. పరిమితులతో రూ.7లక్షలు దాటితే కనీసం రూ.25వేలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

– దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

సర్కారు విద్యకు అధిక ప్రాధాన్యత

టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

సిరిసిల్లటౌన్: సర్కారు విద్యారంగం అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. బుధవారం సిరిసిల్లలోని కుసుమ రామయ్య పాఠశాలలో జరిగిన 'మన బస్తీ..మన బడి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థితికి రావాలన్నారు. సమసమాజ స్థాపన నేటి విద్యార్థులతో సాధ్యమన్నారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇందుకు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య నిదర్శనమన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 12 పాఠశాలలు ఎంపిక చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పాఠశాలలో సోలార్ పవర్ సిస్టం, వంటశాల, డిజిటల్ బోర్డులు, మంచినీరు, టాయిలెట్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, డీఈవో రాధాకిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం

గంభీరావుపేట: మండలం ముచ్చర్లలో ఆధునీకరించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం రవీందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచ్ తేజావత్ రజిత, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీటీసీ స్వప్న, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపసర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంట, నామాపూర్‌లో ఎంపీపీ జనగామ శరత్‌రావు ప్రారంభించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్ వనజ, ఉపసర్పంచ్ సంధ్య, ఎంపీడీవో రమాదేవి, నోడల్ ఆఫీసర్ విఠల్‌నాయక్, హెచ్ఎం బాపురెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో బుధవారం మన ఊరు మన బడి నిధులతో చేపట్టిన పనులను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ ప్రారంభించారు. వైస్ఎంపీపీ కొనుకటి నాగయ్య, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ వనజ, సెస్ డైరెక్టర్ సుధాకర్, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, ఉపసర్పంచ్ పర్శ మల్లేశం, ఏఈలు యాదగిరి, హరీశ్ పాల్గొన్నారు.

చిత్రకథ



డిజిటల్ తరగతులు షురూ

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సెల్‌కాన్, బెన్‌క్యూ కంపెనీల ప్రతినిధులు రేతినేని మురళి, తొగురు అభిషేక్‌రెడ్డి, రాజేశ్‌గుప్తా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ కొనుకటి నాగయ్య, సర్పంచు వంగపల్లి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ కంకణాల వనజ, సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, పర్శ మల్లేశం, నాయకులు సంబ లక్ష్మరాజం, కంకణాల పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్ దరిపెల్లి స్రవంతి, ఉపసర్పంచ్ రాజేందర్ పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన డంప్‌లను సీజ్ చేసి వేలం వేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు. మండలంలోని నాగాయపల్లి శివారులోని దాదాపు 11 ట్రిప్పుల ఇసుకను ఎస్ఐ నాగరాజు తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్న ఇసుక వేలం వేసినట్లు తెలిపారు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లె గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం జెడ్పీటీసీ పూర్మాని మంజుల రూ.10,116 అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పూర్మాని లింగారెడ్డి, కూతురి వెంకట్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకులపై దాడి అమానుషం

బోయినపల్లి: మంత్రి కేటీఆర్ కరీంనగర్ పర్యటన సందర్భంగా విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నాయకులు మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా టీఆర్ఎస్ నాయకులు దాడిచేయడం, పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఖండించారు.

వేతన జీవులను వంచించిన కేంద్రం

ఎల్లారెడ్డిపేట: ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి వేతన జీవులను కేంద్ర ప్రభుత్వం వంచించిదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు అన్నారు. పాత, కొత్త పన్నుల విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయడానికే కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు బడ్జెట్ ద్వారా స్పష్టం అయ్యిందన్నారు. కొత్త పన్ను విధానంలో పన్ను రాయితీ, రూ.5 నుంచి రూ.7 లక్షలకు పెంచారని కొత్త విధానంలో ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. నాయకులు స్వామిగౌడ్, ప్రవీణ్, తిరుపతిజాదవ్, సంతోష్ పాల్గొన్నారు.

అడిషనల్ రిజిస్ట్రార్‌ను కలిసిన చిక్కాల



సుమిత్రకు జ్ఞాపిక అందజేస్తున్న సెస్ చైర్మన్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ అడిషనల్ రిజిస్ట్రార్ సుమిత్రను బుధవారం సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు హైదరాబాద్‌లో కలిశారు. ఆయనతో పాటుగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ, ప్రయాకరావు రాజేందర్ పాల్గొన్నారు.

సంఘాలు - ఎన్నికలు

మహాజన్ సోషలిస్టు పార్టీ మండల కన్వీనర్‌గా రాజం

వీర్నపల్లి: మండల కేంద్రంలో మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కాణాపురం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల మహాజన్ సోషలిస్టు పార్టీ కన్వీనర్ వడ్లూరి రాజంను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ వడ్లూరి రాజం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో పాటు రాజ్యాధికార దిశగా ముందుకు సాగుదామన్నారు. మహాజన్ సోషలిస్టు పార్టీకి తెలంగాణ ప్రజలు అండగా నిల్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గద్దరాశి భగవంతం, గోపాల్, దేవరాజు, సతీశ్, అశోక్, రాజం పాల్గొన్నారు.

ఎస్సారార్ మున్నూరు కాపు సేవా సంఘం

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ శ్రీరాజరాజేశ్వర మున్నూరు కాపు సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముదాం కమలాకర్, గౌరవ అధ్యక్షుడిగా రేండ్ల కనుకయ్య, ఉపాధ్యక్షుడిగా చేపూరి గణేశ్, చిందం శ్రీనివాస్, చేపూరి వెంకటేశ్, ఉప్పు మల్లేశం, చేపూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా బుర్ర రాజు, సంయుక్త కార్యదర్శిగా చేపూరి సుధాకర్, చేపూరి కనుకయ్య, కోశాధికారిగా మినుకుల శ్రీనివాస్, రైటర్‌గా సింగరి మధులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందం రమేశ్, ఉపసర్పంచ్ చేపూరి వరలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో బుధవారం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్లు లేని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. ఇల్లు, భూమి లేని వారందరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో మొదటి దశలో 11 గ్రామాలను ఎంపిక చేసి లబ్ధిదారులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్ అమృత, ఎంపీటీసీ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 5 శాతం నిధులు దివ్యాంగులకు కేటాయించాలి

తంగళ్లపల్లి: దివ్యాంగుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని దివ్యాంగ సమితి జిల్లా అధ్యక్షుడు దొంతినేని చంద్రారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం జరగబోయే రాష్ట్ర శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. దివ్యాంగులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.5 లక్షల వ్యక్తిగత రుణాలు అందించాలని, నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో పెన్షన్ రూ.5,016కు పెంచాలని, దివ్యాంగుల కుటుంబాలకు హెల్త్ కార్డులు, ఉచిత కరెంట్, ప్రతి జిల్లాలో ప్రత్యేక డబుల్ బెడ్రూంలు నిర్మించి దివ్యాంగ కాలనీలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రస్తుతం రూ.3,016 పింఛన్ ఇచ్చి అండగా నిలిచిందని న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలన్నారు. దివ్యాంగులు ప్రభుత్వానికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో అణిచివేతకు గురవుతున్న రజకుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుతామని రజక సంఘం మండల అధ్యక్షుడు కంచర్ల నర్సింహులు అన్నారు. మండలంలోని నారాయణపూర్ మడేలయ్య స్వామి ఆలయం వద్ద బుధవారం సన్మానించారు. రజకులు గ్రామాల్లో వెట్టి చాకిరి చేస్తూ కనీస వేతనం పొందలేకపోతున్నారని ప్రభుత్వపరంగా వచ్చే సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మాటి పర్సయ్య, రాజు, బూపతి, రవి, దేవయ్య, పర్శరాములు పాల్గొన్నారు.